# ముని మాణిక్యం రచనల్లో హాస్యం, చమత్కారం

- *చింతపల్లి గిరిజా శంకర్*

హాస్యం అంటే నిర్వచనం పెద్దలు పలు రకాలుగా చెప్తారు. హాస్యం పుట్టించడం ఎన్ని రకాలుగా చెయ్యవచ్చో అలాగే హాస్యాన్ని వెల్లడించడం (Expression) కూడా రకరకాలు చెయ్యవచ్చు. కిందా మీదా పడి కడుపు పట్టుకుని నవ్వడం, పక్క వాడి వీపు చచ్చేటట్టు బాదడం దగ్గర్నుంచి, చిరు మందహాసం దాకా రకరకాలుగా వెల్లడించవచ్చు. అరవ సినిమాల్లో తంగవేలు వాళ్ళు హైరానా పడి మన్నల్ని అలసింప జేస్తారు. అలా కాకుండా verbal humour మాటల విరుపుడులో వచ్చే హాస్యం అంటే ముళ్ళపూడి వెంకట రమణ"వాడేవడో కారులోకి" భయ "పడ్డాడు" అంటాడు. అలా కాకుండా ఇంకో రకం audio visual హాస్యం, situation బట్టి తయారు చేసేది. పాతాళ భైరవి సినిమా లో రేలంగి రాజ కుమారి కోసం తపిస్తుంటే "మాంత్రికుడు విగ్రహం తేరా రాకుమారితో వివాహం చేయిస్తాను" అంటాడు. విగ్రహం వచ్చాక "తూర్పుగా తిరుగూ రాజ కుమారిని జపం చేయి" అంటాడు. అంటే "తూర్పుకి తిరిగి దండం పెట్టూ" అనే నానుడిని ఒక situation comedyగా మార్చారు. ఇవెందుకు చెప్తునానంటే ఇలాంటి హాస్యాన్ని మాటలతో పుస్తకాల్లో చదువుకుని situation ఊహించుకుని enjoy చేసేటట్లు రాసిన కవులు కొంత మంది ఉన్నారు. అందులో ఇరవయ్యో శతాబ్దం పూర్వార్ధంలో వచ్చిన కవుల్లో ముని మాణిక్యం ముఖ్యులు.

హాస్యం నవరసాల్లో ఒకటైనప్పటికీ మన పురాతన తెలుగు సాహిత్యంలో దీనికి ప్రాముఖ్యత కనబడదు. భారతం భాగవతం రామాయణం ఇంకా ఇతర ప్రబంధాలూ పురాణాల్లో కరుణ వీర భయ భక్తి వగైరాలకున్న ప్రాముఖ్యత లేదు. ఈ రోజుల్లో కూడా మన పుస్తకాల్లో సినిమాల్లో tragedy కి ఉన్న weight (బరువు ) attraction హాస్య రసానికి లేదు. మన సినిమాల్లో హీరో కాని హీరోయిన్ కాని చచ్చి పోతే జనం తండోపతండాలుగా చూస్తారు. ఇక దేవదాసు, పార్వతి యిద్దరూ చస్తే super hit. తెలుగు సాహిత్యంలో హాస్యం నా ఉద్దేశంలో "కన్యాశుల్కం" లో ప్రారంభ మైంది. ప్రతాపరుద్రీయంలో కూడా ఉంది. అంత దాకా ఈ హాస్య రసం కనబడదు. మన సామెతలు చూడండీ "నవ్వు నాలుగు విధాల చేటు", "నవ్వే ఆడదాన్ని నమ్మ రాదు",

నవ్వకుమీ సభ లోపల
నవ్వకుమీ తల్లి తండ్రి నాథుల తోడన్
నవ్వకుమీ పరసతితో
నవ్వకుమీ విప్రవరుల నయమిది సుమతీ

అన్నాడు సుమతీ శతక కారుడు.

అసలు నవ్వు పరిపరి విధాల ఆరోగ్యదాయకం అని scientists ప్రమాణ పూర్వకంగా ఋజువు చేశారు. నవ్వినప్పుడు తక్కువ muscles వాడ్తాము ఏడ్చి నప్పుడు కన్నా. Psychiatry లో నవ్వు మానసిక బాధలని తగ్గిస్తుందని laugh therapy వాడ్తారు. శారీరిక రోగాలను కూడా నయం చేస్తుందని Anatomy of an Illness అనే పుస్తకంలో Norman Cousins examples తో బలపరుస్తారు.

అటువంటి ఆరోగ్యకరమైన హస్యాన్ని మునిమాణిక్యం గారు ఆయన కథల్లో అందించారు. ముని మాణిక్యం నరసింహారావు గారిని కాంతంగారిని నేనెప్పుడూ చూడలేదు మాట్లాడలేదు - ఐనా వారు నాకు చిరపరిచితుల్లాగా బంధువుల్లాగా అనిపిస్తారు. అదీ - ఆయన రచనల్లో గొప్పతనం.

రోజువారీ దైనందిన జీవితంలో ఉండే కష్టాలు, నష్టాలు, పురుళ్ళు, పుణ్యాలు, ఇత్యాది రోజువారీ భవసాగర మధనంలో మధ్య తరగతి కుటుంబ జీవితా లలో రోజూ జరిగే రామాయణానికి నేపధ్య సంగీతలా అన్వయించి రాశారు. "కాంతం కథలు, నేనూ మా కాంతం, తిరు మాళిగ, రుక్కు తల్లి స్తుతి, ఆత్మ స్తుతి, దాంపత్యోపనిషత్, హాస్య కుసుమావళి, గృహప్రవేశం, దీక్షితులు" లాంటి ముని మాణిక్యం రచనలు ఎవరైనా మరచి పోగలరా? కాంతం అయస్కాంతంలా ఎవరిని ఆకర్షించలేదూ? కాంతం పేరు తెలియని తెలుగు కథా పాఠకుడు ఎవరైనా ఉంటారా?

కమ్మని కాపురం చేయడానికి భార్య వైజయంతీ మాల లాగానో వహీదారెహమాన్ లాగానో ఉండక్కర్లేదనీ సంసార పక్షంగా ఉండే సాధారణ స్త్రీలు కూడా ఆకర్షణా ఆత్మీయతా చెలాకీతనం చిలిపితనం సరస సల్లాపాలు వగైరా రసాలన్నీ రంగరించి సంసార జీవితం

స్వర్గమయం చేయగలరని నిరూపిస్తాయి ఈయన కథలు. అలాగే భర్త నలకూబరుడూ, అక్కినేని నాగేశ్వర రావూ కానక్కర్లేదనీ బడి పంతులు ఉద్యోగం చేస్తూ శృంగార వీరుడై Oscar అందుకోవచ్చునని నిరూపిస్తాయి. ఈయన కథలు చదువుతూంటే "అబ్బా పెళ్ళైతే ఇంత బాగుంటుంది కామోసు" అనుకుని పెళ్ళి చేసుకున్న యువకులు యవతులు లేకపోలేదు. పారిజాతాప హరణంలో కృష్ణుడు సత్యభామ చూపిన ప్రణయ కలహాలూ సమాధానాలూ అన్నీ కాంతం కథల్లో తేట తెనుగులో అందరికీ అర్ధమయ్యేలా కనిపిస్తాయి. అవి చదువుతూంటే కథ చదువుతున్నట్లు ఉండదు మనమే - అనుభూతిని ఆస్వాదిస్తున్నట్లు ఉంటుంది.

ముని మాణిక్యం కథల్లో ఆలు మొగల అనుబంధం ఒక ఎత్తు, Self effacing humour ఇంకొక ఎత్తు. ఇందులో మనం గుర్తు పెట్టుకోవాల్సిన అంశాలు రెండు. ఒకటి భర్త సాహిత్యాభిలాష కలిగిన స్కూలు టీచరు - నల్ల బ్రాహ్మడు. భార్య ఐదవ తరగతి కూడా చదవని బాల్య వివాహిత, సదరు సగటు గృహిణి, నలుగురు పిల్లల తల్లి.

ఉదాహరణకి ఒక రోజు కాంతం అమ్మలక్కలతో వరాండాలో కబుర్లు చెప్తుతుంటుంది, ఇంతలో ఎవరో మగవాడు వస్తుంటాడు. అందరూ లేచి ఇంట్లోకి పోబోతుంటారు. అప్పుడు కాంతం ఆయన్ని పరీక్షగా చూసి, "అరే ఎవరో పెద్ద మనిషనుకున్నాను, మన చిట్టి ప్రైవేటు మాష్టారే" అని అందరూ కూర్చుని కబుర్లు.

ఇంకొక కథలో అర్ధరాత్రి పెరట్లో శబ్దమైతే ఇద్దరూ వెళ్తారు ఏమిటో చూదామని. పెరట్లో ఒక దొంగ గొయ్యి తవ్వుతూంటాడు. "ఏమిటి నాయనా తవ్వు తున్నావూ" అంటాడు బడి పంతులు. "నగల కోసం" అంటాడు దొంగ. బడిపంతులింట్లో నగలా? తవ్వు నాయనా తవ్వు ఏమైనా దొరికితే చెరి సగం పంచుకుందాం" అంటాడు. బతకలేక బడిపంతులైనా self effacing subtle humour కి ఒక తార్కాణం.

అలాగే తమ రంగు గురించి మన దేశంలో అందునా మదాంధ్రులకి (సవర్ణ దీర్ఘ సంధి) మన చర్మ సౌందర్యం ఎంత ముఖ్యమో చెప్పనక్కర్లేదు. ఐతే (by self report) ఈయన నల్లని వాడు. అందునా బ్రాహ్మణుడు (నల్ల బ్రాహ్మణ్ణి నమ్మ రాదు) . ఒక సారి ఈయనా ఇంకో పంతులు గారూ నదిలో స్నానానికి వెళ్తారు. ఐతే ఆ రోజుల్లో కులరీత్యా స్నానఘట్టాలుండేవి. హెచ్చు కులాల వాళ్ళు చేసే చోట మిగిలిన కులాల వారు చేయకూడదు. ఇంతలోకి కొంత మంది ఆడా మగా బ్రాహ్మలు వచ్చి "ఇదిగో చూడబ్బాయి ఇది బ్రాహ్మలు చేసే గట్టు, అంటరాని వాళ్ళు ఇక్కడకు రాకూడదు" అంటారు.

అలాగే కాంతానికి తనమొగుడు తెలివి తక్కువ వాడనీ, బేరం తెలియదనీ ఏ వస్తువైనా నాసి రకం తెస్తాడనీ గట్టి నమ్మకం (చాలా మంది ఆడవాళ్ళ లాగా ఒక రోజు దోసకాయలు తెస్తాడు మార్కెట్ నుంచి. "అబ్బే ఏమి దోసకాయలివి,ఇంత మెత్తగా ఉన్నాయి", అంటుంది కాంతం. "బేరం చేసి చవగ్గా కొన్నాను, ఎండబెట్టే గట్టి పడ్తాయంది పుల్లమ్మ" అంటాడు. ఇందులో ఈయన అమాయకత్వం, గడుసుతనం, చమత్కారం teasing ఇత్యాది ఎన్నో రసాలు చూడవచ్చు. అది కూడా ఆయన self effacing humour కి తార్కాణం.

అలాగే కాంతంలో చమత్కారం కనబడే కథ. ఇల్లు కట్టుకుందామని ఈయన ఊహాగానాల్లో ఉంటాడు. షరా మామూలే. ఆమె "చిల్లర కొట్టు బాకీ మూణ్ణెల్ల నుంచీ తీర్చలేదు మన బతుక్కి ఇల్లేంపెట్టి కొందామని" second opinion అడక్కుండానే వేయిస్తుంది. "బాంకులో అప్పు చేసి" అంటాడీయన. అప్పుడామె "వెనకటికొకాయన అన్నాట్ట తమలపాకులు కాసిని ఏ వెధవైనా ఇస్తే బాగుణ్ణు తాంబూలానికి, వక్కలకి ఏమి భాగ్యం ఏ వెధవనడిగినా రెండిస్తాడు, సున్నం గోడ గిల్లి రాసుకోవచ్చు" ఆవటా అంటుంది.

ఆయన హాస్యంలో ఒక ముఖ్య విషయం ఏమిటంటే అందులో ప్రయాగ సంగమంలో సరస్వతీ నది లాగా శృంగారం నిక్షిప్తమై ఉంటుంది. అందుకని కలహాలు అంత ఆహ్లాదకరంగా ఉంటాయి. ఉదాహరణకి ఒక చోట "మా ఆవిడ ముడిలోని ఎఱ్ఱ మందార పుష్పం ఒంటరిగా ఉండి నా వంక కొర కొరా చూసింది" ఆహా ఏమి వర్ణన! కాంతం యొక్క ప్రణయంతో కూడిన కోపాన్ని సూచించేందుకు ఎఱ్ఱని మందార పుష్పం తీసుకున్నాడు. అందులో పుష్పం కాంతం తలలో వంటరిగా ఉందట - అంటే కాంతం యొక్క కోపతీవ్రత తన మనస్సులో ఎంత వేదన కలిగిస్తూందో అని భావం.

అలాగే ఇంకొక రోజు తనూ ఇంకో తెలుగు మాష్టారూ ఊరెళ్దామని ప్లాట్‌ఫారమ్మీద పాసెంజరు బండి కోసం ఎదురు చూస్తుంటారు. ఆ ఊళ్ళో రైలు ఆగదు. ఆరెండో పండితునికి కొంచెం అహంభావం తను

పండితుణ్ణని. ఇంతలో రైలు రయ్యిమని దూసుకు పోతుంది ఇక్కడ ఆగకుండా వీళ్ళ మొహాన బొగ్గూ గాలీ వెదజల్లి. అప్పుడా రెండో పంతులు "ఏంత పొగరు ఈ రైలుకీ" అంటాడు. ఆయన రచనలన్నీ శరద్రాత్రులే, అన్నీ ఆంధ్రాపకోడీలే. ఇలా చెప్పుకుంటూపోతే మూడు రోజులు గూడా చాలదు. ఆయన రచనల్లో బాగు లేనివి లేవు.

చివరి ఉదాహరణ ఈయన పుస్తకాలు చదివి ఈయన దాంపత్య జీవితంలో expert అని భ్రమసి ఒక పెద్దాయన ఈయన్ని తన సంసార బాధలకి సలహా అడగడానికి వస్తాడు. అదే "బద్‌నసీహత్" అనే కథ. ఈయన కథలన్నీ ఎంత సజీవంగా ఉంటాయో ఎంత convincing గా ఉంటాయో అన్న విషయ నిర్ధారణకి ఈ కథ ఒక తార్కాణం.

ఆయన సంసారం ఎల్లప్పుడూ మల్లె పందిరి ఔనో కాదో మనకు తెలియదు. ఐతే ఆయన కాంతంల ప్రేమ మాత్రం అపురూపమైనదని తెలియపరచటానికి ఈ కింద వర్ణన చూడండి ఒక ప్రణయ కలహం చల్లారిన తరువాత.

"పదకొండు గంటలు కొట్టటంతోనే పట్టు బట్ట కట్టుకుని భోజనానికి తయారయ్యాను. ఇల్లు స్వర్గంలా ఉంది. కాంతం ముఖం కార్తీక జ్యోత్స్నలను వెదజల్లు తున్నది. దుఃఖమేఘములు పటాపంచలై పోయినాయి. చెంబులు తెల్ల బడి వెండి చెంబుల వలె మెరుస్తున్నై. బట్టలు పువ్వుల్లాగా ఉతికి పెట్టింది. ఇల్లు అద్దం లాగా ఉంది. దేవతా సహాయం వల్ల జరిగిందా ఇదంతా లేక మాయా అనిపించింది. వంట చక్కగా చేసింది. ముకుళిత కుసుమము వాయు చుంబనం చేత వికసించింది. చిరు కెరటాలను మలయ పవనుడు ముద్దెట్టుకుంటే అవి సంతోషంతో ఎగురుతున్నాయి. వసంతునిచే ముద్దిడబడి పుష్పచయమంతా వికసిస్తున్నై". అటువంటి భర్తని పొందిన కాంతం ధన్యురాలు.

"పరమాహ్లాదకరమైన కుటుంబ జీవితేతివృత్తాన్ని కథగా చెప్పిన మనస్వి ముని మాణిక్యం. రెండు ప్రపంచ యుద్ధాల నడిమి కాలంలో సాహిత్య సిద్ధాంతాల పేరిటా రాజకీయ ఉద్యమాల పేరిటా అస్తవ్యస్తంగా గందర గోళంగా ఉన్న తెలుగు సాహిత్యంలో ఒయాసిస్సు గానూ వెన్నెల రాత్రి గానూ ఆయన కథలు దర్శనమిస్తాయి. - ఆయన కథలన్నీ శరద్రాత్రులే" అని మానసా పబ్లికేషన్స్ వారు వారి పీఠికలో రాశారు.

ముని మాణిక్యం నిజంగా మన మాణిక్యం. తెలుగు కథా రచనాధుని మాణిక్యం. కాంతం గారి మణి మాణిక్యం. కర్మయోగిగా పరిపక్వం చెందిన "ముని" మాణిక్యం. *****

